# సమ్మెకు సమాయత్తం

- 20న కార్మికుల సామూహిక సమ్మె
- ఇప్పటికే సమ్మె నోటీసులు అందజేత
- ఇబ్రహీంపట్నంలో అధిక ప్రభావం చూపే అవకాశం
- సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావం





కొండపల్లి పీహెచ్‌సీ వద్ద ఆశా వర్కర్ల నిరసన (ఫైల్): మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తనకు సమ్మె నోటీస్ అందజేస్తున్న మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు

**ఇబ్రహీంపట్నం:** తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అసంఘటిత రంగ కార్మికులు సమ్మెకు సమాయత్తమవుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని కార్మిక రంగాల్లో రాజకీయ జోక్యం ఎక్కువైంది. అనేక చోట్ల కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని అన్యాయంగా తొలగిస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం ఇవ్వడం లేదు. కార్మికులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, భవన నిర్మాణ కార్మికులు, ఆశాలు, అంగన్‌వాడీలు, తోపుడు బండ్లు, ఆటో, భవన నిర్మాణ కార్మికులు ఈనెల 20న సామూహిక సమ్మె చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఆయా ప్రభుత్వ శాఖల అధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు. కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా పలు కార్మిక, ప్రజా సంఘాలు సమ్మెకు బాసటగా నిలుస్తున్నాయి.

### పరిశ్రమలపై ప్రభావం..

పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఇబ్రహీంపట్నం, కొండపల్లి ప్రాంతంలో అసంఘటిత రంగ కార్మికులు వేల సంఖ్యలో పని చేస్తున్నారు. కొండపల్లి ఇండస్ట్రియల్ పార్క్, ఎన్టీటీపీఎస్, గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు, స్టోన్ క్రషర్లు, రాతి క్వారీలు, భవన నిర్మాణ కార్మికులు, వర్తక వ్యాపారులతో పాటు సామాజిక సేవలు అందిస్తున్న ఆశాలు, అంగన్‌వాడీలు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు సుమారు ఆరు వేల మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా జాతీయ సమ్మెలో పాల్గొనేలా అధికారులకు నోటీలు అందజేశారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి సమ్మెలో పాల్గొంటున్నామని వారు ప్రకటించారు. వీరంతా సమ్మెలో పాల్గొనడం ద్వారా పారిశ్రామిక రంగాల్లో వస్తు ఉత్పత్తి నిలిచిపోయే ప్రమాదం ఉంది. పారిశుద్ధ్య కార్మికులు విధులు బహిష్కరిస్తే వీధుల్లో చెత్త తరలింపునకు ఆటంకం ఏర్పడుతుంది. పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలపై ప్రభావం చూపుతుంది. రవాణా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతాయి.

### డిమాండ్లు ఇవీ..

ఆశా వర్కర్లకు నెలకు రూ. 20 వేల వేతనం, రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్ రూ.5 లక్షలు, ఇన్సూరెన్స్ రూ.10 లక్షలు, ఒకవేళ మరణిస్తే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా గుర్తింపు ఇవ్వాలి. వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి. అలవెన్సులు, బెన్‌ఫిట్‌లతో పాటు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. మున్సిపల్ కార్మికుల గత సమ్మె కాలపు హామీలు అమలు చేయాలి. ఇంజినీరింగ్ కార్మికులకు రూ.24 వేలు, పారిశుద్ధ్య కార్మికులకు రూ.21 వేల వేతనం ఇవ్వాలి. రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్ రూ.75 వేలు, సహజ మరణానికి రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.7లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. మట్టి ఖర్చులకు రూ.25 వేలు, కార్మికుల స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలి. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ, లేబర్ కోడ్స్ రద్దు చేయాలి.

### ప్రభుత్వాల కళ్లు తెరిపిస్తాం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను నిలువునా మోసం చేస్తున్నాయి. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి వాటి స్థానంలో లేబర్ కోడ్స్ తీసుకువచ్చాయి. లేబర్ కోడ్స్ వలన కార్మికుల హక్కులు హరించుకుపోయాయి. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడానికి పూనుకున్నాయి. సమ్మెతో కార్మికులు మోసపోకుండా ప్రభుత్వాల కళ్లు తెరిపిస్తాం.

– ఎ.విఠల్‌రావు, చిరు వ్యాపారుల సంఘం గౌరవాధ్యక్షుడు

### సమ్మెను విజయవంతం చేస్తాం



సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న జరుగనున్న సమ్మెలో ఆటో వర్కర్స్ యూనియన్ సభ్యులు అందరూ పాల్గొని విజయవంతం చేస్తాం. దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ సమస్యల పరిష్కారానికి పట్టుపడతాం. రవాణా చట్టంలో తీసుకొచ్చిన మార్పులతో కార్మికులు నష్టపోతున్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలి.

– రెంటపల్లి చంటి, ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు

# వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నిస్తున్న వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ

**నూజివీడు:** మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరిగింది. చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం స్థానిక మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కౌన్సిలర్లు శీలం రాము, నవుడు నాగమల్లేశ్వరరావు, నడకుదురు గిరీష్ తదితరులు మాట్లాడుతూ గత నెలలో నిర్వహించాల్సిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని ఎందుకు నిర్వహించలేదని కమిషనర్‌ను నిలదీశారు. గత నెలలో సమావేశాన్ని నిర్వహించుకుంటే ఈ సమావేశంలో ఒక్కసారే 60కి పైగా అంశాలను అజెండాలో పెట్టుకోవాల్సిన పని ఉండేది కాదన్నారు. ప్రత్యేక నిధులు మంజూరైనప్పుడు వాటితో ఏఏ పనులు చేపట్టాలి అనే దానిపై చర్చించేందుకు ప్రత్యేక సమావేశాలు కూడా పెట్టుకోవడానికి వీలున్నప్పుడు సాధారణ సమావేశం నిర్వహించకపోవడం సమంజసం కాదని మండిపడ్డారు. దీనికి కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి బదులిస్తూ కౌన్సిల్ సమావేశానికి మంత్రి కొలుసు పార్థసారథి వస్తానన్నారని, అయితే ఎప్పుడు వస్తారు? అనే తేదీ చెప్పకపోవడంతో ఆ నెలలో నిర్వహించలేదని చెప్పారు.

**మంచినీటి ఎద్దడి నివారణపై చర్యలేవి?**

వేసవి ప్రారంభమైన మార్చి నెలలోనే పట్టణంలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని, మరమ్మతులకు గురైన చేతిపంపులను రిపేరు చేయడానికి సామగ్రిని అందుబాటులో ఉంచాలని చెప్పినప్పటికీ చర్యలు తీసుకోలేదని కౌన్సిలర్లు అధికారులను ప్రశ్నించారు. వేసవి పూర్తయిన తరువాత సామగ్రి తెస్తే ఉపయోగం ఏమిటని, దీనిపై పట్టణ ప్రజలకు అధికారులు సమాధానం చెప్పాలన్నారు. దీనికి ఏఈ బదులిస్తూ అప్రూవల్ కోసం ఉన్నతాధికారులకు పంపామని, రాగానే సామగ్రిని తెస్తామన్నారు. అనంతరం శీలం రాము మాట్లాడుతూ పెద్దచెరువుకు గండ్లు పడి ఇప్పటికే పది నెలలు కావస్తున్నా ఇంత వరకు గండ్లు పూడ్చలేదని, దీంతో పట్టణంలో భూగర్భ జలాలు పడిపోతున్నాయని, వెంటనే గండ్లు పూడ్చటానికి చర్యలు తీసుకోవాలన్నారు.

**అధికారులు రానప్పుడు సమావేశాలు ఎందుకు?**

30వ వార్డు కౌన్సిలర్ నడకుదురు గిరీష్ మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశానికి పలు శాఖల అధికారులు రావడం లేదని, అధికారులు రానప్పుడు కౌన్సిల్ సమావేశం నిర్వహించుకోవడం ఎందుకు అని ప్రశ్నించారు. పట్టణంలోని కొండయ్య సత్రం షాపుల అద్దె విషయంపై ప్రశ్నించారు. సమావేశంలో వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అధికారం కోసం టీడీపీ అడ్డదారులు

- తిరువూరు నగర పంచాయతీ కైవశానికి టీడీపీ కుయుక్తులు
- కౌన్సిలర్లకు ప్రలోభాలు
- టీడీపీ ముఖ్యనేతల కనుసన్నల్లో బేరసారాలు



తిరువూరు నగర పంచాయతీ కార్యాలయం

**తిరువూరు:** తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి రాజీనామా అనంతరం ఈ నెల 19న జరుగనున్న ఎన్నికలో కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకునేందుకు తెలుగుదేశం నాయకత్వం ప్రయత్నాలు చేస్తోంది. గత ఎన్నికల్లో టీడీపీ కేవలం ముగ్గురు కౌన్సిలర్లు అతికష్టం మీద గెలవగా, 17 మంది కౌన్సిలర్లతో వైఎస్సార్ సీపీ తిరువూరు నగర పంచాయతీని కై వశం చేసుకుంది. తొలుత పార్టీ నిర్దేశించిన సూచనల మేరకు చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి ఇటీవల రాజీనామా సమర్పించారు. దీనితో చైర్‌పర్సన్ ఎన్నికకు ఆర్డీఓ నోటిఫికేషన్ జారీచేశారు. గత రెండు రోజులుగా టీడీపీ జిల్లా నేతలు తిరువూరులో మకాం వేసి కౌన్సిలర్లకు లక్షలాది రూపాయలు ఎరచూపుతూ కౌన్సిల్‌ను కై వశం చేసుకునేందుకు అడ్డదారుల్లో ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

**ఏకతాటిపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు**

తెలుగుదేశం నాయకులు ఎన్ని ప్రలోభాలకు గురిచేస్తున్నా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు పార్టీ నిర్ణయానికే కట్టుబడ్డారు. తొలుత పార్టీ ఇచ్చిన సూచనల మేరకు 15వ వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్‌ను చైర్‌పర్సన్ పదవికి ఎంపిక చేయడానికి మూడో వార్డు నుంచి గెలుపొంది చైర్‌పర్సన్‌గా ఉన్న గత్తం కస్తూరిబాయి రాజీనామా చేశారు. చైర్‌పర్సన్ ఎన్నికకు జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి మాధురి ప్రిసైడింగ్ అధికారి హోదాలో నోటిఫికేషన్ జారీచేశారు. ఈ నెల 19న చైర్‌పర్సన్ ఎన్నిక జరుగనుంది. ఈ నేపథ్యంలో ఎక్స్ అఫీషియో సభ్యుడైన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుతో సహా 20 మంది కౌన్సిలర్లకు ఎన్నికల నోటీసును అధికారులు పంపారు. ఎటువంటి బలం లేకపోయినా తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్‌ను కై వశం చేసుకునేందుకు టీడీపీ నాయకత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. టీడీపీ నేతలు కౌన్సిలర్లకు డబ్బు ఎరచూపడంతో పాటు, నగర పంచాయతీలో కాంట్రాక్టు పనులు అప్పగిస్తామని, భవిష్యత్‌లో మరిన్ని ప్రయోజనాలు చేకూరుస్తామని ఆశ చూపుతూ ఎన్నికల ప్రక్రియలో గందరగోళం సృష్టిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు పర్యవేక్షణలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు పార్టీ విప్ ననుసరించి చైర్‌పర్సన్ ఎన్నికలో పాల్గొంటామని చెబుతున్నారు.

## విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



తిరువూరు గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

**తిరువూరు:** వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞానం, వినోదం అందించేందుకు తిరువూరు, పెనుగొలను, గంపలగూడెం గ్రంథాలయాల్లో గురువారం పలు కార్యక్రమాలు జరిగాయి. తిరువూరు గ్రంథాలయంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించారు. పెనుగొలను శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం, విద్యార్థులతో కథలు చెప్పించడం, చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. గంపలగూడెం గ్రంథాలయంలో విద్యార్థులకు ఇంగ్లిష్‌లో మాట్లాడటం, కథలు చెప్పించడంలో శిక్షణ ఇచ్చారు.

**రిటైర్డు ఉపాధ్యాయులకు సన్మానం**

**తిరువూరు:** స్థానిక సుందరయ్య భవన్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో గురువారం రిటైర్డు ఉపాధ్యాయులను సన్మానించారు. కంభంపాడు ఎంపీపీ స్కూల్ రిటైర్డు ప్రధానోపాధ్యాయిని ముదునూరు కమలమ్మ, కోడూరు జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయిని తొమ్మండ్రు ఆరోగ్యంలను విద్యార్థులు, ఉపాధ్యాయులు సత్కరించారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, ఉపాధ్యక్షుడు హరికృష్ణ, సభ్యులు రాంప్రదీప్, పాపారావు, సుదర్శన్, సుధాకర్, జగన్‌మోహనరావు, సుబానీ, ఉషారాణి పాల్గొన్నారు.

## కోడిగుడ్ల లోడు లారీ బోల్తా



**నూజివీడు:** స్థానిక బైపాస్ రోడ్డులో పోతురెడ్డిపల్లి క్రాస్ రోడ్డు వద్ద గురువారం కోడిగుడ్ల లోడు లారీ ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తాపడింది. ఆటోపై లారీ పడటంతో ఆటో నుజ్జునుజ్జయ్యింది. ఆటోలో ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. కారును తప్పించబోయి లారీ బోల్తా పడినట్లు స్థానికులు చెబుతున్నారు.

## అవకతవకలకు పాల్పడితే సహించం

**జి.కొండూరు:** గ్యాస్ సిలిండర్ల డెలివరీలో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా సదరు ఏజెన్సీలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ భానుప్రసాద్ అన్నారు. ప్రపంచ మెట్రాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధి పినపాక శివారు విద్యానగర్‌లోని భారత్ గ్యాస్ బాటిలింగ్ కంపెనీలో ఎల్‌పీజీ డీలర్లకు అవగాహనా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్లను అధిక ధరలకు విక్రయించినా, సిలిండర్లను పక్కదారి పట్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలను పాటిస్తూ గ్యాస్ కొరత లేకుండా సిలిండర్లను సరఫరా చేయాలని చెప్పారు. కార్యక్రమంలో భారత్ గ్యాస్ కంపెనీ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**తిరువూరు:** అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం అందించే సహాయం పొందడానికి ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ కోరారు. తమకు సమీపంలోని రైతు సేవా కేంద్రంలో 1బీ లేదా పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్సు కాపీలను సమర్పించి పథకం ద్వారా లబ్ధి పొందాలని సూచించారు.

## సారా తయారీని వీడి సగర్వంగా జీవించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఆవులయ్య

**నూజివీడు:** సారా తయారీని విడనాడి సమాజంలో గౌరవంగా జీవించాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఎ. ఆవులయ్య అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నవోదయం 2.0 పై సారా తయారీదారులు, విక్రయించేవారిలో మార్పు తీసుకువచ్చేందుకు గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సారా తయారీ, క్రయవిక్రయాలు చట్ట విరుద్ధమన్నారు. సారా సేవనంతో ఆరోగ్యం క్షీణిస్తుందని చెప్పారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ అనిత మాట్లాడుతూ నవోదయం 2.0 కార్యక్రమంలో వాస్తవాలు గ్రహించి క్రమశిక్షణతో జీవించాలనుకునే వారి కోసం అనేక శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు. నూజివీడు, కైకలూరు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లు ఎ.మస్తానయ్య, రమేష్, వెలుగు ఏపీ డీటీ సుందరరావు, ఉన్నతి ఏపీఎం డి.సుమలత, శ్రీనిధి మేనేజర్ ఎం.గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్ధంతరంగా నిలిచిన రహదారి పనులు

- రోడ్డు తవ్వి వదిలివేయడంతో రాకపోకలకు ఇబ్బందులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహన చోదకులు



జి.కొండూరులో సీసీ రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయిన ప్రాంతం

**జి.కొండూరు:** జి.కొండూరు నుంచి గంగినేని వెళ్లే రాష్ట్ర రహదారి విస్తరణ పనులలో భాగంగా ప్రారంభంలో జి.కొండూరు వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులను నిలిపివేయడంతో గ్రామస్తులు నరకయాతన పడుతున్నారు. జి.కొండూరు వద్ద 8.700 కిలోమీటరు నుంచి 9.430 కిలోమీటరు వరకు 650 మీటర్లు సీసీ రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఇప్పటికే 500 మీటర్లు మేర సీసీ రోడ్డును నిర్మించిన కాంట్రాక్టరు మిగిలిన 150 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి రహదారిని నెలన్నర క్రితం తవ్వి వదిలేశారు. ఈ ప్రాంతంలో రహదారిని లోతుగా తవ్వి నిర్మించాల్సి ఉండగా కృష్ణా వాటర్ మెయిన్ పైపులైను ఉండటంతో పనులను నిలిపివేసినట్లు తెలిసింది. రహదారిని తవ్వి అలా వదిలివేయడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాల రాకపోకలతో వచ్చే దుమ్ముతో పక్కనే నివాసం ఉంటున్న గ్రామస్తులు, దుకాణాల నిర్వాహకులు నరకయాతన పడుతున్నారు. అధికారులు స్పందించి సీసీ రోడ్డు నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## సబ్సిడీపై సమీకృత దాణా అందజేత



పాడి రైతుకు దాణా అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత, నాయకులు

**భవానీపురం(విజయవాడపశ్చిమ):** జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీపై సమీకృత దాణా పంపిణీ కార్యక్రమం గొల్లపూడిలోని మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్కో కుటుంబానికి గరిష్టంగా రెండు పెద్ద పశువులు, ఒక దూడకు 90 రోజులకుగాను 450 కేజీల దాణాను పంపిణీ చేస్తున్నామన్నారు. అర్హులైన పశు పోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గొల్లపూడి పశువుల ఆసుపత్రి వైద్యుడు హరీష్ మాట్లాడుతూ పాడి రైతులు తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండటంతో పాటు భారత్ పశుధన్ యాప్‌లో నమోదై ఉండాలని పేర్కొన్నారు. 50 కేజీల దాణా బ్యాగ్ విలువ రూ.1110 కాగా సబ్సిడీపై రూ.555లకు లభిస్తుందని తెలిపారు. పశు పోషకులు దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకుని డబ్బు చెల్లించాలని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు బొమ్మసాని సుబ్బారావు, గొల్లపూడి ఏఎంసీ చైర్మన్ నర్రా వాసు తదితరులు పాల్గొన్నారు.

## పాత నేరస్తుల బైండోవర్

**తిరువూరు:** సారా అమ్మకాలు, తయారీ కేసుల్లో నిందితులుగా ఉన్న పలువురు వ్యక్తులను తిరువూరు ఎక్సైజ్ అధికారులు గురువారం రెవెన్యూ అధికారుల ఎదుట బైండోవర్ చేశారు. ఎ.కొండూరు తండాకు చెందిన మలావతు ధౌలా, గొల్లమంద తండాకు చెందిన బాణావతు నాగేంద్ర బాబు, రవీంద్ర, భూక్యా సుక్కో, కుమ్మరికుంట్ల తండాకు చెందిన భూక్యా జ్యోతి, గోపాలపురానికి చెందిన ధరావతు రాములును ఎ.కొండూరు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె. శ్రీనివాస్ తెలిపారు. విస్సన్నపేట మండలం నరసాపురానికి చెందిన అంగోతు శంకర్ పలు కేసుల్లో నిందితుడిగా ఉండి తప్పించుకు తిరుగుతుండగా అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. తెల్లదేవరపల్లి తండాలో నవోదయం కార్యక్రమం నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్ఐలు వెంకట కుమార్ కృష్ణవేణి, విస్సన్నపేట ఏఎస్ఐ బాణావత్ సక్రూ, టాస్క్‌ఫోర్స్ సీఐ వర్మ, ఎస్ఐ శేఖర్‌బాబు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

మంత్రి పార్థసారథి



**చాట్రాయి:** ప్రజా దర్బార్ ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని చిన్నంపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఫ్యాకల్టీలను నియమించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామానికి చెందిన కొమ్ము సుజనరావు మంత్రికి అర్జీ ఇచ్చారు. పలువురు సమస్యలపై మంత్రికి అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, ఎంపీడీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు భాషను కాపాడుకోవాలి

**మైలవరం:** తెలుగు భాష ఎంతో ఉన్నతమైనదని, తెలుగు భాషను కాపాడుకోవడం ఎంతో అవసరమని మైలవరం ఎస్వీఆర్‌జీఎన్నార్ జెడ్పీహెచ్ స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు పాటిబండ్ల శ్రీనివాసరావు అన్నారు. వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మైలవరం శాఖా గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలుగు భాష ప్రయోజనం, తెలుగు భాష ఏర్పడిన విధానం, తెలుగు భాష గొప్పతనం, తెలుగు భాషను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ సుధాకర్



**మైలవరం:** గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ సుధాకర్ డిమాండ్ చేశారు. మైలవరంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో స్వీపర్స్, డ్రెయినేజీ క్లీనర్స్, వాటర్ వర్క్స్, ఎలక్ట్రీషియన్, డ్రైవర్లు తదితర విభాగాల్లో అనేక సంవత్సరాలుగా ఎంతోమంది కార్మికులుగా పనిచేస్తున్నారన్నారు. నిత్యావసరాల ధరల పెరుగుదలతో ప్రస్తుతం ఇస్తున్న వేతనాలు చాలక కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. రోజుకు అన్ స్కిల్డ్ వర్కర్‌కు రూ.596, స్కిల్డ్ వర్కర్‌కు రూ.835 తగ్గకుండా వేతనం చెల్లించాలని కోరారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి మహ్మద్ రఫీకి వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్మికులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### డెంగీపై అవగాహన అవసరం

**నూజివీడు:** ఇంటి పరిసరాల్లో మంచినీరు నిల్వ ఉండకుండా చూసుకుంటే డెంగీ జ్వరాన్ని నియంత్రించవచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎం.యలమంద అన్నారు. పట్టణంలోని కోనేరుపేట అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 16న జరుగనున్న జాతీయ డెంగీ దినోత్సవం నేపథ్యంలో గురువారం సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డెంగీ వ్యాప్తికి కారణాలతో పాటు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

### టీడీపీ గ్రామ అధ్యక్ష ఎన్నిక రసాభాస



**జి.కొండూరు:** తెలుగుదేశం పార్టీ జి.కొండూరు గ్రామ అధ్యక్ష ఎన్నిక రసాభాసగా మారింది. మైలవరం నియోజకవర్గంలో గ్రామగ్రామాన వర్గపోరు తారస్థాయికి చేరిందనడానికి ఈ ఘటన నిదర్శనంగా నిలిచింది. వివరాలలోకి వెళ్తే.. టీడీపీ జి.కొండూరు గ్రామ అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు పార్టీ నాయకులంతా గురువారం రాత్రి పులివాగు పక్కన ఉన్న పార్టీ కార్యాలయం వద్ద సమావేశమయ్యారు. అధ్యక్ష పదవి కోసం గ్రామం నుంచి ఏడుగురు పోటీలో నిలిచారు. ఈ క్రమంలో నాయకుల అభిప్రాయాలను కోరిన సమయంలో పదవి కోసం పోటీపడిన నాయకులు పదవి తమకే కావాలంటూ వర్గాలుగా విడిపోయి బాహాబాహీకి దిగడంతో అరుపులు, కేకలు, తోపులాటలతో ఆ ప్రదేశం కొద్దిసేపు గ్యాంగ్‌వార్‌ని తలపించింది. వివాదం ముదురుతున్న క్రమంలో మండల నాయకులు ఎన్నికను వాయిదా వేసి వెళ్లిపోయారు.

### బోరు ఏర్పాటుకు భూమి పూజ

**జి.కొండూరు:** మండల పరిధి చెవుటూరు హిందూ శ్మశాన వాటిక వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న బోరు బావి కోసం సర్పంచ్ పిన్నిబోయిన శ్రీదేవి, వైస్ ఎంపీపీ పుప్పాల సుబ్బారావు గురువారం భూమి పూజ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు రూ.1.5 లక్షలతో బోరు, మోటారును ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

### 18న ఉచిత వైద్య శిబిరం

**కొండపల్లి(ఇబ్రహీంపట్నం):** డాక్టర్ మోహనరావు మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కొండపల్లిలో ఈనెల 18న ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని వైద్యశాల డైరెక్టర్, ప్రముఖ సర్జన్ డాక్టర్ మామిడి సీతారామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈసీజీ, బీపీ, మధుమేహ రక్త పరీక్షలు, బీఎండీ, పీఎఫ్‌టీ వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారని చెప్పారు. అవసరమైన వారికి ఎక్స్‌రే, ఇతర రక్త పరీక్షలు 50 శాతం సబ్సిడీపై నిర్వహిస్తారన్నారు. జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, పల్మనాలజిస్టులు అందుబాటులో ఉంటారని చెప్పారు.

### కరపత్రాల ఆవిష్కరణ

**ఇబ్రహీంపట్నం:** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మికులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఇబ్రహీంపట్నంలో కరపత్రాలను ఆవిష్కరించారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు పెండ్యాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు కార్మికులకు వర్తింపజేయాలని కోరారు. లేబర్ కోడ్స్ రద్దు, సంక్షేమ బోర్డు పునరుద్ధరణ కోరుతూ ఈనెల 20న జరగనున్న జాతీయ సమ్మె విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

### పాలిసెట్‌లో వికాస్ విద్యార్థి ప్రతిభ

**విస్సన్నపేట:** పాలిసెట్ పరీక్షలో విస్సన్నపేట వికాస్ పాలిటెక్నిక్ విద్యార్థిని దంతాల లక్ష్మీప్రియ 2120 ర్యాంకు సాధించిందని వికాస్ విద్యాసంస్థల అధినేత ఎస్. నర్సిరెడ్డి తెలిపారు. పాలిసెట్‌లో మంచి ర్యాంకు సాధించిన లక్ష్మీప్రియను ఆయన అభినందించారు.